క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతలకు విరాళం బాండ్‌లను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేరువేరుగా బుధవారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన కాపుల రాజేంద్రప్రసాద్ లక్ష రూపాయలు, తణుకుకు చెందిన కంభంపాటి సోమేశ్వరరావు లక్ష రూపాయలను ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

అశోక్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు


అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షులు డీఎన్నార్

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన కళ్లచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మేడవరపు అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఆయన బుధవారం పరామర్శించి, అశోక్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సేవాదృక్పథం కలిగిన నేతను కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, సొసైటీ మాజీ చైర్మన్ సాయినా కనకరాజు, మేడూరి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

కొయ్యలగూడెం: కుంతలగూడెం సమీపంలో సంభవించిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భాగ్యవతి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. కుంతలగూడెం గ్రామంలో ఈ నెల 18న ట్రాక్టర్ అదుపు తప్పి ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలపై దూసుకెళ్లడంతో గ్రామానికి చెందిన అల్లే భాగ్యవతి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భర్త వీరబ్బులు ఆమె కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. అదే విధంగా గాయపడిన వారికి రెండు లక్షల రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి ఐదులక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మన్నవ కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు, గొలిమే బాల ఏసు, తాడిగడప ఆంజనేయరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతలపూడి ఎమ్మెల్యేను కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూనపాముల విఘ్నేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాలు, పనుల అప్పగింత, సాంఘిక భద్రత మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జంగారెడ్డిగూడెం ఇంజనీరింగ్ విభాగం సెక్రటరీ నిమ్మల సుబ్బారావు, అప్పలస్వామి, యడ్లపల్లి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెటాలిక్ బ్యారన్లతో రైతులకు మేలు

- నరికొత్త పద్ధతిలో పొగాకు క్యూరింగ్ చేస్తున్న రైతులు
- బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకున్న సాంకేతిక పరిజ్ఞానం
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనం
- ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో 32 లూజ్ లీఫ్ బ్యారన్లు ఏర్పాటు


లూజ్ లీఫ్ బ్యారన్‌లో వర్జీనియా పొగాకును ఐరన్ ట్రేలలోకి క్యూరింగ్‌కు ఎక్కిస్తున్న కూలీలు

బుట్టాయగూడెం: సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలోని రైతులు వ్యవసాయంలో ముందుకు సాగుతున్నారు. బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకున్న లూజ్ లీఫ్ బ్యారన్ ద్వారా క్యూరింగ్ చేసే పద్ధతిని గత ఏడాది ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టారు. అయితే అవి సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ ఏడాది ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో సుమారు 32 మెటాలిక్ బ్యారన్లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు పంట చేతికి రావడంతో రైతులు మెటాలిక్ బ్యారన్లలో క్యూరింగ్ చేసుకుంటున్నారు.

లూజ్ లీఫ్ బ్యారన్‌తో లాభాలు

లూజ్ లీఫ్ బ్యారన్ ఏర్పాటుతో లాభాలు ఎన్నో ఉన్నాయని పొగాకు రైతులు అంటున్నారు. పొగాకును ఐరన్ ట్రేల్లో ఉంచి క్యూరింగ్ చేయడం వలన 50 శాతం కూలీల అవసరం తగ్గుతుందంటున్నారు. సాధారణ బ్యారన్‌లో ఒక లోడ్ పొగాకు క్యూరింగ్ అయితే లూజ్ లీఫ్ బ్యారన్‌లో రెండింతల వర్జీనియా పొగాకు క్యూరింగ్ చేసుకోవచ్చు. అదే విధంగా క్యూరింగ్ తర్వాత 4, 5 గంటల్లో బ్యారన్ వాటర్ ద్వారా సరైన పదును అందించి అన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేవిధంగా వర్జీనియా పొగాకు క్యూరింగ్‌కు పుల్ల వినియోగం కూడా సగం వరకూ తగ్గుతుంది. మొత్తంగా వర్జీనియా క్యూరింగ్ ఖర్చు 50 శాతం తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. అదే విధంగా పూర్తి స్థాయి సామర్థ్యంతో క్యూరింగ్ చేస్తే పొగాకు సీజన్‌కు రైతుకు రూ.లక్ష వరకూ ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.


లూజ్ లీఫ్ బ్యారన్‌లో క్యూరింగ్ చేసిన పొగాకు


మండలంలోని అచ్చియ్యపాలెంలో ఏర్పాటు చేసిన లూజ్ లీఫ్ బ్యారన్

నాణ్యమైన పొగాకు దిగుబడి

వర్జీనియా పొగాకు లూజ్ లీఫ్ బ్యారన్ ద్వారా క్యూరింగ్ చేస్తే నాణ్యమైన దిగుబడి వస్తుంది. నిర్దేశిత ఉష్ణోగ్రతల వద్ద మొదట పుల్లలతో పొగాకు క్యూరింగ్ చేస్తారు. అదే విధంగా ఆటోమేటిక్ సెన్సార్ల ద్వారా విద్యుత్ మోటార్లు, ఫ్యాన్లు, బ్లోయర్లు పని చేసి ఉష్ణోగ్రతలో హెచ్చు తగ్గులను క్రమబద్ధీకరిస్తారు. ఈ బేరన్‌ను మెటల్‌తో నిర్మించడం వలన అగ్ని ప్రమాదం సంభవించదు. తోటల్లో కొట్టిన పొగాకు మెటాలిక్ ట్రేల్లో అమర్చి వాటిని బ్యారన్ లోపలికి స్టాండ్‌లు ఏర్పాటు చేస్తారు. గతంలో పొగాకును గుర్రాలపై పురుకోసతో, కర్రలతో కట్టి అల్లి బ్యారన్‌కు ఎక్కించేవారు. ఇప్పుడు ఆ అవసరం లేదని రైతులు అంటున్నారు. లూజ్ లీఫ్ బ్యారన్‌లో ఉడికించిన పొగాకును నేరుగా గ్రేడింగ్ చేయించుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

లూజ్ లీఫ్ బ్యారన్ ఎంతో ఉపయోగం


నేను ప్రతీ ఏడాది పొగాకు పంటను 150 నుంచి ఎకరాల వరకు పంట పండిస్తాను. పొగాకు వ్యవసాయం అంటే చాలా కష్టంతో కూడుకున్న పని. ఆకు కొట్టడానికి, కట్టడానికి, క్యూరింగ్‌కు ఎక్కించడానికి చాలా అవస్థలు పడేవాడిని. క్యూరింగ్ అయిన తరువాత గ్రేడింగ్‌కు ఎక్కువ మంది కూలీలు అవసరమయ్యేవారు. అయితే గత ఏడాది నుంచి లూజ్‌లీఫ్ బ్యారన్‌ను ఏర్పాటు చేసుకున్నాను. ఈ బ్యారన్‌లో రెండు లోడ్ల పొగాకు ఒక్కసారిగా క్యూరింగ్ అవుతుంది. కూలీల ఖర్చు తగ్గుతుంది. నాణ్యమైన పొగాకు వస్తుంది.

–సయ్యద్ బాజీ, పొగాకు రైతు, అచ్చియ్యపాలెం

ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ


లూజ్ లీఫ్ బ్యారన్‌లో క్యూరింగ్ చేయడం వలన క్యూరింగ్‌కు అవసరమయ్యే పుల్ల, కూలీలకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. అలాగే క్యూరింగ్ బాగుంటుంది. నాణ్యమైన పొగాకు అందుతుంది. కూలీల కోసం ఇబ్బంది పడవలసిన పనేమీ లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో లూజ్ లీఫ్ బ్యారన్ రైతులకు మేలు చేస్తుంది.

–బి.శ్రీహరి, వేలం నిర్వహణ అధికారి, జంగారెడ్డిగూడెం

విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం: జంగారెడ్డిగూడెం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో డీఈ పీర్ అహ్మద్ ఆదేశాల మేరకు విద్యుత్ పలు మండలాల్లో క్రమబద్ధీకరిస్తున్నట్లు కొయ్యలగూడెం ఏఈ ఎస్వీ రామారావు పేర్కొన్నారు. మరమ్మతుల దృష్ట్యా జంగారెడ్డిగూడెం విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో ఈ నెల 21 తేదీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో వ్యవసాయానికి సంబంధించి త్రీఫేస్ విద్యుత్తును ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల లోపు దశలవారీగా ఇస్తామన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆ మేరకు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఒంపోలు సూరిబాబు(37) కార్పెంటర్ వృత్తితో జీవిస్తున్నాడు. స్థానిక కొత్తపేట కాలనీలో కార్పెంటర్ షాపు పెట్టుకున్నాడు. అయితే సరైన పనులు లేకపోవడంతో షాపును తీసివేసి రోజువారీ పనులకు వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో 11వ తేదీ రాత్రి కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన సూరిబాబు తోబుట్టువులు వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్య నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

నారసింహుడికి వెండి వింజామర సమర్పణ


సిబ్బందికి వింజామరను అందిస్తున్న దాత

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీకనకవల్లి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ఓ భక్తుడు బుధవారం వెండి వింజామరను సమర్పించారు. తూర్పు గోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, పోతవరం గ్రామానికి చెందిన అతుకూరి సూర్యచంద్రం దంపతులు ముందుగా స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రూ.29 వేలు విలువైన వెండి వింజామరను ఆలయ ప్రధానార్చకులు కోడూరి ఈశ్వర్‌కుమార్ శర్మ, సిబ్బంది మన్మధరాజా, పసుపులేటి పండులకు అందజేశారు.

నేడు సమీక్ష సమావేశం

కుక్కునూరు: మండలంలోని పెదరావిగూడెం, కుక్కునూరు, కొండిన్యముక్తి శివాలయాల్లో ఈ నెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన మధ్యాహ్నం మూడు గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.రమేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలన

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులను ఆదేశించారు. ఆయన పట్టిసం రేవులో ఇసుక తిన్నెలపై శివక్షేత్రం వద్ద నిర్వహిస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాల్లో అధికారులు కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కుక్కునూరు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమీస్తున్న వేళ మండలంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. పలు పార్టీలకు చెందిన నాయకులు వారి అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం సీపీఎం నాయకులు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కుక్కునూరులోని గ్రాడ్యుయేట్లను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్ల లక్ష్మయ్య, పూలదాసు రమేష్, వలిపాషా, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తా

చింతలపూడి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర్య అభ్యర్థి హాసన్ షరీఫ్ కోరారు. బుధవారం చింతలపూడిలో ఆయన పలువురు పట్ట భద్రులను కలిసి వారి మద్దతు కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగ యువత ఆలోచించి ఓటు వేయాలని కోరారు. తనను గెలిపిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో యువతకు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హాసన్ షరీఫ్ ముస్లిం పెద్దలు ఎండీ అక్బర్ అలి, సయ్యద్ ఖాజా మొహిద్దిన్‌లను కలిసి మద్దతు కోరారు.


కుక్కునూరు: పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు


చింతలపూడి: మద్దతు ఇవ్వాలని కోరుతున్న స్వతంత్ర అభ్యర్థి హాసన్ షరీఫ్

రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

లింగపాలెం: మండలంలోని గణపవారిగూడెంలో చేస్తున్న భూముల రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి నూజివీడు సబ్ కలెక్టర్ చరణ్ రాజు ఆదేశించారు. రీ సర్వేను బుధవారం సబ్ కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. భూములకు సంబంధించిన రైతులకు ముందుగా నోటీసులు జారీ చేయాలన్నారు. రైతుల సమక్షంలో భూములను సర్వే చేసి వారికి అప్పగించాలన్నారు. గణపవారిగూడెంలో జనవరి 20వ తేదీన సర్వేను ప్రారంభించామని మొత్తం 494 ఎకరాలకు గాను ఇప్పటికి 400 ఎకరాలు సర్వే పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్ వీడీవీ ప్రసాద్‌బాబు, రీ సర్వే డీటీ ఎన్.నాగబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రీ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ చరణ్ రాజు

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

బుట్టాయగూడెం: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి జ్ఞానం అనే జ్యోతిని వెలిగిద్దామని జిల్లా జీసీడీఓ (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) వి.నవీన, సీడీపీఓ ఏలూరు తులసి అన్నారు. బుట్టాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు మొదటిరోజు జ్ఞానజ్యోతిపై శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ జ్ఞానజ్యోతి అనే కార్యక్రమం 120 రోజుల ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో దూబచర్ల డైట్‌కు చెందిన జిల్లా స్థాయి పరిశీలకులు కేఆర్‌పీ అబ్దుల్ అజీజ్, ఎంఈఓలు టి.బాబూరావు, నరేంద్రరాయ్, హెచ్‌ఎం గంగాదేవి, డీఆర్‌పీలు ఎండీ ముషబ్బర్, టి.స్వాతి పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమం పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ శిక్షణా కేంద్రాన్ని జీసీడీవో బి.నవీన పరిశీలించారు. శిక్షణ ఏవిధంగా ఇస్తున్నారు అనే విషయాలను రీసోర్స్ పర్సన్ నుంచి తెలుసుకున్నారు.

శిక్షణలో మెలకువలను నేర్చుకోవాలి

కొయ్యలగూడెం: జ్ఞాన జ్యోతి శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు మెలకువలను నేర్చుకొని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జీసీడీవో వి.నవీన బుధవారం బాయ్స్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీపీఆర్‌పీలుగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకాయమ్మ, సరస్వతి, ఎస్.శివరామహరిప్రసాద్, ఎస్‌కే రఫీ, సీహెచ్ పాండు రంగ, సీఆర్‌పీలు వెంకటరమణ, ప్రసన్న పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: కార్యక్రమంలో పిల్లలకు బోధించే పరికరాలను ప్రదర్శిస్తున్న సీడీపీఓ తులసి


కొయ్యలగూడెం: శిక్షణా తరగతులోల ప్రసంగిస్తున్న జీసీడీవో నవీన

టి.నరసాపురంలో

టి.నరసాపురం: జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న మండల స్థాయి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో టి.రామూర్తి, ఐసీడీఎస్ సీడీపీవో పి.మాధవిలు బుధవారం సందర్శించారు. డీఆర్‌పీలు జీసీ ఎస్‌వీఎస్ కృష్ణారావు, ఎంవీవీ సుబ్బారావు, టి.రామాంజిబాబు, హైస్కూల్ హెచ్‌ఎం, పాల్గొన్నారు.

రాజబాబును కోల్పోవడం దురదృష్టకరం



రాజబాబు చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పిస్తున్న నౌడు వెంకటరమణ, మాజీ మంత్రి కారుమూరి, తదితరులు

ద్వారకాతిరుమల: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబును కోల్పోవడం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో రాజబాబు నివాస గృహానికి బుధవారం ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా రాజబాబు చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అలాగే రాజబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు, ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మరడ అనీల్‌కుమార్, బి.ప్రసాద్ మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, దాలయ్య, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ

పోలవరం రూరల్: ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాన్ని పోలవరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటంతో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, ధైర్యానికి, ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన గొప్ప వీరుడిగా, హిందూ ధర్మాన్ని, స్త్రీని గౌరవించిన వ్యక్తిగా పేరుగాంచారన్నారు. కార్యక్రమంలో కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ నుంచి మంచి క్రమశిక్షణ పట్టుదల నేర్చుకోవాలని దేశ భక్తి, త్యాగనిరతి విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, డాక్టర్ సీహెచ్ బదరి నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

ఎక్సైజ్ అధికారుల దాడులు


చింతలపూడి: నాగిరెడ్డిగూడెంలో పట్టుబడిన బెల్లంతో అధికారులు


బుట్టాయగూడెం: ముద్దప్పగూడెంలో నాటుసారా పనిముట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

చింతలపూడి: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెంలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతం పాత చెరువు పుంత వద్ద 30 కేజీల బెల్లాన్ని స్వాధీన చేసుకొని 300 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఏలూరు ఏఈఎస్‌జీ పాండురంగారావు, సీఐ బి.సత్యనారాయణ, ఎస్ఐపీ శివధర్, ఈఎస్‌టీఎఫ్ సీఐ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో నాటుసారా తయారీకి ఉపయోగించే ఐదు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్, తాడేపల్లిగూడెం సీఐ స్వరాజ్‌లక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


విద్యార్థినులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతను దాస్

బుట్టాయగూడెం: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని రాజమండ్రికి చెందిన ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతను దాస్ అన్నారు. మండంలోని బూసరాజుపల్లి ఏపీ గురుకుల బాలికల కళాశాలలో ఓఎన్‌జీసీ సామాజిక బాధ్యత పథకంలో భాగంగా గిరిజన యువతకు గవర్నమెంట్ రిజర్వేషన్ సిస్టం అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్ కోసం ఓఎన్‌జీసీ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లను ఉపయోగించుకుని యువత, విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కెరియర్‌కు సంబంధించిన పుస్తకాల కిట్‌ను పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ డీజీఎం సోమనాథ్, కేఆర్‌పురం డీవైఈఓ రామ్‌మోహన్, ఏఎంఓ శిరమయ్య, షెడ్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధీర్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు బి.అనిల్ కుమార్, కె. శ్రీనివాస్, ఎస్ఎంటీ జి.వీరశేష, ప్రిన్సిపాల్, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.